పండగొచ్చింది

- కిటకిటలాడిన రైతు బజార్లు
- స్వగ్రామాలకు వెళ్లేవారితో రహదారులు రద్దీ
- నేడు భోగి పండగ • రేపు సంక్రాంతి సంబరాలు



గుమ్మడి పండ్లు



గోపాలపట్నం రైతు బజారులో పూజా సామగ్రి కొనుగోలు

గోపాలపట్నం: పండగ కళ వచ్చేసింది. రైతు బజార్లు కిటకిటలాడాయి. కలగూరకు అవసరమైన కూరగాయల కోసం గోపాలపట్నం,మర్రిపాలెం రైతు బజార్లకు వినియోగదారులు క్యూ కట్టారు.భోగి రోజు దేవుడికి పప్పు అన్నం, సంక్రాంతినాడు పెద్దలకు కలగూర నైవేద్యం సమర్పించడం ఆనవాయితీ. అందుకు అవసరమైన గుమ్మడి కాయ, కంద, చెరుకు, పూలు వంటివి కొనుగోలు చేశారు. ఎన్‌ఏడీ నుంచి వేపగుంట కూడలి వరకూ షాపింగ్‌మాళ్లు రద్దీగా మారాయి.



ఎన్‌ఏడీ జంక్షన్ బస్ స్టాప్ వద్ద ప్రయాణికులు



రైతు బజారులో వినియోగదారులు



సింహాచలం రైల్వే స్టేషన్‌లో రద్దీ

స్వగ్రామాలకు ప్రయాణం

వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఉద్యోగ, ఉపాధి నిమిత్తం ఇక్కడ స్థిరపడిన వారంతా సొంత గ్రామాలకు తరలి వెళ్లారు. దీంతో ఏ కూడలిలో చూసినా రద్దీ కనిపించింది. గోపాలపట్నం బంక్ సెంటర్ ఆదివారం ఉదయం నుంచే రద్దీగా మారింది. ఇక ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని శ్రీకాకుళం, విజయనగరం వైపు సొంత వాహనాల్లో సింహాచలం గుండా వెళ్లారు. దీంతో గోపాలపట్నం బంక్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను నియంత్రించేందుకు ఎక్కువగా శ్రమించాల్సి వచ్చింది. ఎన్‌ఏడీ జంక్షన్ వద్ద ప్రయాణికులు బస్సులు కోసం నిరీక్షించారు. సింహాచలం రైల్వే స్టేషన్ ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. చాలా మంది ద్వారాల వద్ద వేలాడుతూ వెళ్లారు. మరికొంత మంది ఆ రద్దీ చూసి వెనక్కి వచ్చేసి ప్రైవేటు వాహనాల్లో పండగకు వెళ్లారు.



గోపాలపట్నం బంక్ జంక్షన్ వద్ద బీఆర్‌టీఎస్ రహదారిలో వాహనాలు

క్లుప్తంగా

నేరాల నియంత్రణపై అవగాహన ర్యాలీ



కంచరపాలెంలో ర్యాలీ చేస్తున్న క్రైం పోలీసులు

గోపాలపట్నం: పండగ సెలవుల్లో స్వగ్రామాలకు వెళ్లేవారు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని క్రైం పోలీసులు కోరారు. ఈ మేరకు ఆదివారం కంచరపాలెం నుంచి బుచ్చిరాజుపాలెం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అప్రమత్తతో నేరాలను నియంత్రించివచ్చునని తెలిపారు. ఇళ్లు విడిని వెళ్లే వారు విలువైన వస్తువులు, బంగారం వంటివి ఇంట్లో ఉంచరాదని సూచించారు. ఇంటికి తాళం వేసి వెళ్లేవారు ఆ ప్రాంత క్రైం పోలీసులకు తెలియపరచాలని సూచించారు. అలా తెలిపిన ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా బీట్ వేస్తామని ఎస్‌ఐలు సుదర్శనరావు, శ్రీనివాసరావు తెలిపారు.

ఆశ్రమం నుంచి కుటుంబం చెంతకు..



కుటుంబం చెంతకు చేర్చిన నిర్వాహకులు

విశాఖ విద్య: మతి స్థిమితం లేని వ్యక్తికి ఆశ్రయం కల్పించడంతో పాటు వారి కుటుంబ సభ్యులకు ఆదివారం అప్పగించారు జీవీఎంసీ షెల్టర్ నిర్వాహకులు. మర్రిపాలెం రైల్వే స్టేషన్‌లో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న వ్యక్తిని షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత బుచ్చిరాజుపాలెం తీసుకొచ్చి ఆశ్రయం కల్పించారు. ఝార్కండ్‌లోని లుంగ్టు గ్రామానికి చెందిన సోమా సులాంకి కోలుకున్న తర్వాత వివరాలు చెప్పడంతో వారి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. బుచ్చి రాజుపాలెంలోని షెల్టర్‌కు రప్పించి ఆర్‌పీఎఫ్ పోలీసుల సహకారంతో కుటుంబ సభ్యులకు అప్పగించారు. కుటుంబ సభ్యులు షెల్టర్ మేనేజర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



భోగి పాట పాడుతూ రంగవల్లి చుట్టూ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

మల్కాపురం: మల్కాపురంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల వద్ద ఆదివారం సంక్రాంతి సంబరాలను అట్టహాసంగా నిర్వహించారు. విద్యార్థినులు, అధ్యాపకులు భోగి మంట వేసి సందడి చేశారు.అనంతరం మైదానంలో పెద్ద పెద్ద రంగు రంగు ముగ్గులు వేసి వాటి మధ్య గొబ్బెమ్మలను నెలకొల్పి విద్యార్థినులు నృత్యాలు చేశారు. అధ్యాపకులు,విద్యార్థులు అన్న తేడా లేకుండా అంతా ఉత్సాహంగా గడిపారు.

వింటర్ వర్క్‌షాప్‌తో మహిళా సాధికారత

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జీఈఎం వింటర్ వర్క్‌షాపును యువతులు సద్వినియోగం చేసుకోవాలని దీపికా లేడీస్ క్లబ్(డీఎల్‌సీ) అధ్యక్షురాలు నీతాశర్మ కోరారు. ఎన్టీపీసీ సింహాద్రి దీపికా లేడీస్ క్లబ్ సహకారంతో స్థానిక బాలభారతి పబ్లిక్ స్కూల్‌లో రెండు రోజులపాటు జరిగే ఈ వర్క్ షాపులో పాల్గొన్న 13 జెడ్పీ పాఠశాలలకు చెందిన 110 మంది బాలికలకు సాధికారత కల్పించారు. ఈ వర్క్‌షాపులో పాల్గొన్న నీతాశర్మ మాట్లాడుతూ వర్క్‌షాపులో వ్యక్తిత్వ వికాసం, నాయకత్వం, స్థితిస్థాపకతపై ఆకర్షణీయమైన అంశాలు ఉంటాయన్నారు. వర్క్ షాపులో పాల్గొన్న బాలికలకు స్టేషనరీ కిట్లు, యోగా మ్యాట్‌లను పంపిణీ చేశారు. సింహాద్రి ప్రాజెక్టు హెడ్ సమీర్‌శర్మ మాట్లాడుతూ సమాజంలో సాధికారత, సమగ్రతను పెంపొందించడంలో సింహాద్రి నిబద్ధతను చాటుతుందన్నారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు పాల్గొన్నారు.

మారథాన్.. అదిరెన్



మారథాన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు తదితరులు



మారథాన్‌లో పాల్గొన్న పారిశ్రామిక వాసులు

మల్కాపురం: స్వామి వివేకానంద జయంతి సందర్భంగా బీజేపీ నాయకుడు పాలిమేర శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన 5 కే మారథాన్‌ను ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. 59వ వార్డు జింక్ ఆంజనేయస్వామి ఆలయం నుంచి కోరమాండల్, శ్రీహరిపురం,యారాడ పార్కు మీదుగా నిర్వహించిన మారథాన్ ఉత్సాహంగా సాగింది. ఎమ్మెల్యే గణబాబు కూడా ఐదు కిలో మీటర్లు పరుగు తీశారు. ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతి రోజు యువతను ఉత్తేజ పరిచే కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యువత వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో నాయకులు కె.విజయబాబు,నక్క లక్ష్మణరావు,రామ్మోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు వివేకానందుడు



శాంతిగిరికాలనీలో మాట్లాడుతున్న విజయ్‌కుమార్



శాఖా గ్రంథాలయంలో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

మల్కాపురం: నేటి యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని ఎస్సీ మోర్చా నాయకుడు కె.విజయ్‌కుమార్ అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా 59వ వార్డు శాంతిగిరికాలనీలో ఆదివారం వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చికాగోలో సర్వమత సమ్మేళనంలో చేసిన ప్రసంగం చిరస్మరణీయమన్నారు.

మల్కాపురం శాఖా గ్రంథాలయంలో స్వామి వివేకానంద చిత్రపటానికి జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, ప్రముఖ రచయిత కరుకు సత్తిరాజు,గ్రంథాలయాధికారి అజేయ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన బాటలో యువత నడవాలని కోరారు.

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంపై దృష్టి సారించాలి



మటన్ స్టాల్స్ వద్ద అవగాహన కల్పిస్తున్న తిరుమలనగర్ అసోసియేషన్ ప్రతినిధులు



స్టీల్‌బాక్స్‌లో చేపలు వేయిస్తున్న తిరుమల నగర్‌వాసి

అగనంపూడి: ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, స్టీల్‌పాత్రలు వినియోగించాలని తిరుమలనగర్ అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు కోరారు. 87వ వార్డు తిరుమలనగర్‌లోని చేపలు, మాంసం మార్కెట్‌లో ఆదివారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే అనర్థాలు తెలిసి కూడా ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నామని, దీని వల్ల భవిష్యత్‌లో ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్రతీ ఒక్కరూ మార్కెట్‌కు వెళ్లేటప్పుడు క్లాత్ సంచులు, స్టీల్‌పాత్రలతో వెళ్లాలన్నారు. కార్యక్రమంలో పరమానందం, వసంతరెడ్డి, శ్రీరాములు, కామరాజు, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటర్ వర్సిటీ కరాటే పోటీలకు ఏయూ విద్యార్థులు



క్రీడాకారులను అభినందిస్తున్న ఆచార్య విజయ మోహన్ తదితరులు

విశాఖ విద్య: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు ఏయూ క్రీడాకారులు అర్హత పొందినట్లు ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య ఎన్.విజయమోహన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పురుషుల కరాటే పోటీలు 15 నుంచి 18 వరకు ఎండీ యూనివర్సిటీ రోహ్‌తక్‌లో జరిగే పురుషుల కరాటే పోటీల్లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల ఎంసీఏ విద్యార్థి వి.బాలసూర్య, 19 నుంచి 21 వరకు జరిగే మహిళల పోటీల్లో సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల బీకాం విద్యార్థి సీహెచ్ ప్రవల్లిక పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచి, విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. ఎంపికైన క్రీడాకారులను వ్యాయామ విద్య విభాగం హెడ్ ఆచార్య ఎ.పల్లవి, ఏయూ దూరవిద్య కేంద్రం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దొరబాబు, జట్టు మేనేజర్ అండ్ కోచ్ చిన్నారావు అభినందించారు.

పండగకు ఊరు వెళ్తున్నారా.. బహుపరాక్

సౌత్ సబ్ డివిజన్ క్రైం సీఐ శ్రీనివాసరావు



అక్కిరెడ్డిపాలెం: పండగలకు ఊళ్లు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని గాజువాక పోలీసులు సూచిస్తున్నారు. పట్టణ ప్రాంతాల నుంచి వారి వారి గ్రామాలకు వెళ్లే వారు విలువైన వస్తువులు, బంగారు ఆభరణాలు భద్రంగా ఉంచుకోవాలంటున్నారు. చోరీల కట్టడికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే పలు కూడళ్ల, రద్దీ ప్రాంతాల్లో పండగ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అలాగే ఇంటి ముందు గాని, సమీపంలో దొంగతనాలు జరిగినట్టు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని సౌత్ సబ్ డివిజన్ క్రైం సీఐ పి.శ్రీనివాసరావు కోరారు.

పండగ సెలవులకు వెళ్లే వారు సమాచారాన్ని స్టేషన్‌లో తెలియజేస్తే పోలీసులు వారి ఇంటికి ఎల్‌హెచ్‌ఎంఎస్ కెమెరాలు ఏర్పాటు చేస్తారని తెలిపారు. యాప్‌లో తమ వివరాలు పొందుపర్చాలని సూచించారు.

చోరీల నియంత్రణకు పోలీసుల సూచనలివీ

- ప్రయాణిస్తున్న ట్రావెల్స్ వివరాలు సోషల్ మీడియాలో పెట్టవద్దు.
- ఇంటి లోపల, బయట, ఎంట్రీ, ఎగ్జిట్‌లలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలి.
- ఊర్లు వెళ్లేవాళ్లు ఇంట్లో విలువైన బంగారు ఆభరణాలు, నగదు తమ వెంట తీసుకువెళ్ల కుండా బ్యాంకు లాకర్లలో భద్ర పర్చుకోవాలి.
- ఊర్లు, విహార యాత్రలకు వెళ్లే వాళ్లు వివరాలను పోలీస్ స్టేషన్‌లో చెప్పి వెళ్లాలి.
- పెద్ద పెద్ద భవనాలు, అపార్ట్‌మెంట్లలో సెక్యూరిటీ గార్డులను పెట్టి జాగ్రత్తగా గమనించమని చెప్పాలి.
- ఊర్లు వెళ్లే టప్పుడు ఇంటి పక్కవారికి లేదా తెలిసిన వారికి తమ ఇంటిని గమనించమనాలి.
- ఏదైనా సమస్య వస్తే డయల్ 112కు లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి.
- అనుమానాస్పద వ్యక్తులు మీ మీ ఏరియాల్లో తిరిగితే పోలీసులకు సమాచారం అందించండి.
- ఇంటికి స్మార్ట్ లాకర్ల ఏర్పాటు చేసుకోవాలి. ఈ లాకర్లను దొంగలు ముట్టినా.. వేరే తాళం ఉపయోగించినా లాకర్ నుంచి పెద్ద శబ్దంతో అలారం మోగుతుంది.

54వ సారి రక్తదానం



రక్తదానం చేస్తున్న ఉక్కు ఉన్నతాధికారి శ్రీనివాస్

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం డీజీఎం (ఆపరేషన్)గా విధులు నిర్వహిస్తున్న కర్రి శ్రీనివాస్ 54వ సారి రక్తదానం చేశారు. చాలా అరుదైన గ్రూపు (ఓ–వీఈ) రక్తాన్ని దానం చేసి రికార్డు నెలకొల్పారు. అక్కయ్యపాలేనికి చెందిన ఖాదర్ జిలానీ (60) కాలు జారి కింద పడిపోవడంతో కాలు విరిగిపోయి ఎముక బయటకు వచ్చింది. కేజీహెచ్‌లో అత్యవసరంగా ఆపరేషన్ చేయాల్సి రావడంతో శ్రీనివాస్ స్పందించి రోటరీ బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్తాన్ని దానం చేశారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.

త్రీస్టార్స్ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం



త్రీస్టార్స్ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

కంచరపాలెం: ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో త్రీస్టార్స్ వాకర్స్ క్లబ్ 2025 సంవత్సరానికి నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం వేడుకగా జరిగింది. గౌరవాధ్యక్షుడిగా పెతకంశెట్టి సుకుమార్, అధ్యక్షుడిగా జయతి ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా జె.రమేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా కాళ్ల వెంకట ప్రసాద్, సహాయ కార్యదర్శిగా ఇమాన్యుయేల్, కోశాధికారిగా సొండి కిషోర్‌కుమార్, జాలీవాకర్‌గా నరసింహారావు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లుగా ఎస్. వెంకట్రావు, జి.శ్రీనివాస్. వి.వి.గణపతి, తిరుపతిరావు, అప్పలసూరి, సీహెచ్ అప్పారావు, కటుమూరి శ్రీనివాస్, పి.కోటేశ్వరరావు, రెడ్డి శ్రీనివాస్, వి.ఎ.స్వామి, పి.ఉమామహేశ్వరరావు, బి.రామకృష్ణ, ఎన్.శంకరరావు, టి.అప్పారావు, పీఎస్ మూర్తి పటాన్‌యక్, వీఏవీ శ్రీనివాస్, ఆర్.వెంకటేష్, పి.చిన్నవెంకటరాజు, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఎస్. సూర్యారావు, ఎలక్షన్ అధికారిగా అడబాల సత్యనారాయణ, ఆడిటర్‌గా రామకృష్ణ, సలహాదారులుగా వి.రాంబాబు, వి.నూకరాజు, పి.అప్పలనాయుడు, మణిభూషణ్ ఎంపికయ్యారు. 101 గవర్నర్ వాకర్ ద్వారకానాథ్, ప్లాటినం డోనర్ వాకర్ ప్రభావతి నూతన కమిటీచే ప్రమాణ స్వీకారం చేయించారు.

ఆ ముగ్గురు 'ఉక్కు'ద్రోహులు

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గంగారావు
- భోగిమంటలో బ్యానర్ దహనం చేసి నిరసన



మోదీ,చంద్రబాబు, పవన్‌కల్యాణ్ తీరును నిరసిస్తూ వేసిన భోగిమంట

మద్దిలపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్రధాని నరేంద్ర మోదీ ద్రోహం చేశారని, ఆయనకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు సహకరించారని, ఈ ముగ్గురూ స్టీల్‌ప్లాంట్ ద్రోహులుగా చరిత్రలో నిలిచిపోతారని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.గంగారావు మండిపడ్డారు. మద్దిలపాలెం కళాభారతి రోడ్డులో వేసిన భోగిమంటలో ఆ ముగ్గురి బొమ్మలతో కూడిన బ్యానర్‌ను వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ మోదీ స్టీల్‌ప్లాంట్‌కోసం ఒక్క మాట కూడా ప్రస్తావించలేదని, పైగా ఆర్సిలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు కావాల్సిన ఇనుప ఖనిజాన్ని పైపులైను ద్వారా అందించడానికి సహకరిస్తామని చెప్పుకొచ్చారన్నారు. దానికి వెంటనే బాబు, పవన్‌కల్యాణ్ ధన్యవాదాలు తెలియజేయడం దుర్మార్గమన్నారు. లక్ష కుటుంబాలకు ఉపాధి ఇస్తున్న స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బతీయడానికి మిట్టల్ స్టీల్ వస్తోందని చెప్పారు. విశాఖలో మిట్టల్ స్టీల్ ప్లాంట్ పెట్టడమంటే ప్రభుత్వస్టీల్‌ప్లాంట్‌ను మిట్టల్‌కు అప్పగించేందుకు కుట్ర పన్నడమేనని, ఉద్యోగులను, కార్మికులను బలవంతంగా తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ మాట్లాడడం లేదని, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు పల్లెత్తుమాట మాట్లాడకపోవడం తగదని చెప్పారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించాలని, కార్మికులకు, ఉద్యోగులకు జీతాలుచెల్లించాలని, వీఆర్‌ఎస్‌ను విరమించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, పి.మణి, మద్దిలపాలెం జోన్స్ కార్యదర్శి వి.కృష్ణారావు, జోన్ నాయకులు పి.వెంకటరావు, కుమారి, కుమార్‌మంగళం, త్రినాథ్, జి.వి.ఎస్. చలపతి, జీవి రమణ, అనపర్తి అప్పారావు, పీతల అప్పారావు తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

తీరిన రహదారి కష్టాలు



పూర్తయిన రహదారి

గోపాలపట్నం: కొత్తపాలెం నుంచి నరవ వెళ్లే రహదారిలో యునైటెడ్ చర్చి వద్ద పాడైన రహదారి మరమ్మతు పనులు పూర్తి చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డు గోతుల మయంగా మారింది. రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడేవారు. దీంతో జీవీఎంసీ నిధులు సుమారు రూ.32 లక్షలు వెచ్చించి రోడ్డు పనులు చేశారు. ఈ రహదారి పనులు పూర్తి కావడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు ట్రోఫీ, క్యాష్ ప్రైజ్ అందజేస్తున్న కార్పొరేటర్ గోవింద రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ హార్ట్ ఫుల్ ఓల్డ్ అండ్ న్యూ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం సాయంత్రంతో ముగిసింది. భెల్ టౌన్ షిప్‌లోని క్రీడా మైదానంలో జరిగిన టోర్నమెంట్ ఫైనల్స్‌లో గ్రీన్ పాన్ 11 విన్నర్స్‌గా, దంగల్ 11 రన్నర్స్‌గా నిలిచాయి. విజేత జట్టుకు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి ట్రోఫీతో పాటు రూ.10000 క్యాష్ ప్రైజ్ అందజేశారు. బీహెచ్‌పీవీ ఓల్డ్, భెల్ న్యూ ఉద్యోగుల కుటుంబాల పిల్లల కోసం బీహెచ్‌పీవీ హార్ట్ ఫుల్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నమెంట్ మూడు రోజుల పాటు ఉత్సాహంగా జరిగింది. కార్యక్రమంలో ప్రతినిధులు శ్రీరాములు, గలావిల్లి శ్రీనివాస్, పల్సర్ బైక్ డ్యాన్సర్ ఝాన్సీ, వీనా (యుఎస్‌ఏ), పీటీ మాస్టర్ త్రిమూర్తులు, హీరో రోహన్, ఫ్రెండ్స్ ప్రతినిధులు రామ్‌జానే, రవి, నాని, రమేష్, కృష్ణ, నాయుడు, ఆనంద్, పి.శ్రీను, కుమార్, శ్రీకర్ పాల్గొన్నారు.